క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఆనందగజపతిరాజుకు ఘన నివాళి



ఆనందగజపతిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవస్థానం ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం మాజీ అనువంశిక ధర్మకర్త దివంగత ఆనందగజపతిరాజు వర్ధంతిని బుధవారం దేవస్థానం పరిపాలనా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆనందగజపతిరాజు చిత్రపటానికి దేవస్థానం ఈవో కె.సుబ్బారావు పూలమాలవేసి నివాళులర్పించారు. దేవస్థానం అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ సునీల్, లీగల్ అడ్వైజర్ ప్రసాద్‌వర్మ, వేదపండితులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుని అదృశ్యంపై ఫిర్యాదు



జయ హరనాథ్

పెందుర్తి: వేపగుంట సమీపంలోని అప్పన్నపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన శేఖరమంత్రి జయ హరినాథ్(70) అనే మతిస్థిమితం లేని వృద్ధుడు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న గత నెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో అతడి కుమారుడు సాయిరాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

1.5 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన నిందితుడు, గంజాయితో పోలీసులు

పెందుర్తి: ఒడిశా ప్రాంతం నుంచి నగరానికి గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పెందుర్తి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న కొలూరి శ్యామ్‌కుమార్ ఒడిశా నుంచి 1.5 కిలోల గంజాయిని తరలిస్తున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో నిందితుడ్ని పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

28 నుంచి నూకాంబిక పండగ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కూటమి నాయకులు

పరవాడ: వెన్నెలపాలెంలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న నూకాంబిక అమ్మవారి పండగ వాల్‌పోస్టర్‌ను గ్రామ పెద్దలు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేయనున్నట్లు పేర్కొన్నారు. పండగ సందర్భంగా రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పెద్దలు రతాల సన్యాసిరావు, అభినాయుడు, వెన్నెల నరసింగరావు, పైల ప్రసాద్, పైల జూనియర్ అప్పలనాయుడు, బండారు సోమునాయుడు, వాసిరెడ్డి ఈశ్వరరావు, ఎర్రినాయుడు, వెన్నల ప్రసాద్, వెంకట గిరి, బొజంకి నాయుడు పాల్గొన్నారు.

13న గురుకులం ప్రవేశ పరీక్ష

పెందుర్తి: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్(నాయుడు తోట) సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.మృదుల ప్రియదర్శిని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్నవారు పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

పడిగాపులు తప్పని అప్పన్న ప్రసాదం!



చిన్నారులతో క్యూలో నిరీక్షణ

- అన్నప్రసాదానికి క్యూల్లో గంటల తరబడి నిరీక్షణ
- భారీ భవనం ఉన్నా.. భక్తులకు తప్పని అవస్థలు
- సెంట్రల్ స్టోర్స్, ప్రసాదశాల సర్దుబాటుతో ఇరుకు
- వాటి కోసం కొత్త భవనాలకు చొరవ చూపని అధికారులు



అన్నప్రసాద భవనం వద్ద క్యూలో వేచి ఉన్న భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సింహాచలం క్షేత్రంలో నిత్యాన్నదాన పథకంలో అందించే అన్నప్రసాదానికి ఎంతో విశిష్టత ఉంది. స్వామివారి దర్శనానంతరం ఎలాగైనా అన్నప్రసాదం స్వీకరించే.. సింహగిరి నుంచి తిరుగుపయనం అవ్వాలని భక్తులు ఆశిస్తారు. తీరా అన్నప్రసాద భవనం వద్దకు వెళ్లేసరికి అక్కడ కనిపించే చాంతాడంత క్యూలైన్లను చూసి నిరాశ చెందుతున్నారు. గంటల తరబడి క్యూల్లో వేచి ఉండలేక నిరాశగా వెనుదిరుగుతున్నారు.

సింహాచలం:

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సింహాచలం ఒకటి. సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందు ప్రతిరోజూ దేశవ్యాప్తంగా అనేక మంది భక్తులు వస్తుంటారు. వీరిలో పేద, మధ్యతరగతికి చెందిన భక్తులే ఎక్కువ. వీరంతా స్వామివారి దర్శనం చేసుకున్న తర్వాత దేవస్థానానికి చెందిన నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించేందుకు ఆసక్తి చూపుతారు. చాలా మంది దాన్ని మహా ప్రసాదంగా భావిస్తారు. అయితే దర్శనానంతరం అన్నప్రసాద భవనం వద్దకు వెళ్లే భక్తులకు అక్కడి పరిస్థితులు తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. గంట నుంచి గంటన్నరపాటు నిరీక్షించాల్సి వస్తోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

ప్రసాదాలకు పైఅంతస్తు.. స్టోర్స్‌కి గ్రౌండ్ ఫ్లోర్

2012 వరకు భక్తులకు అన్నప్రసాదాన్ని అందించేందుకు సింహగిరిపై సరైన భవనం అందుబాటులో లేదు. పెరుగుతున్న భక్తుల రద్దీను దృష్టిలో ఉంచుకుని దివ్యక్షేత్రం అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.5 కోట్లతో భారీ భవనాన్ని నిర్మించి 2013లో అన్నప్రసాదానికి అందుబాటులోకి తెచ్చారు. కింది, పై అంతస్తుల్లో అన్నప్రసాదం అందించేలా భవనం సమకూరడంతో భక్తుల బాధలు తొలగిపోతాయని అందరూ భావించారు.

పదేళ్ల క్రితం ఆలయ ప్రాంగణంలో ఉండే సెంట్రల్ స్టోర్స్ భవనాన్ని తొలగించడంతో దాన్ని తీసుకొచ్చి అన్నదాన భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో కొంత భాగాన్ని కేటాయించారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో కొత్తగా భవనాన్ని నిర్మించినా.. స్టోర్స్‌ను మాత్రం అక్కడికి తరలించలేదు. అందులో స్వామివారి ఆభరణాల మ్యూజియంను ఏర్పాటు చేశారు. గతంలో ఆలయ ప్రాంగణంలో ఉన్న లడ్డు, పులిహోర తయారీ, ప్యాకింగ్‌శాలల్ని కూడా మూడేళ్ల క్రితం అన్నప్రసాద భవనం పైఅంతస్తులోకి మార్చారు. దీంతో అన్నదాన భవనం పైఅంతస్తు పూర్తిగా అన్నప్రసాదం స్వీకరించే భక్తులకు కాకుండా పోయింది.



అన్నదాన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో కొంత భాగంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ స్టోర్స్



పైఫ్లోర్‌లో ప్రసాదాల ప్యాకింగ్

ఆ రెండింటిని తరలిస్తేనే..

సెంట్రల్ స్టోర్స్, ప్రసాదాల తయారీశాల, ప్యాకింగ్‌శాలలకు ప్రత్యామ్నాయంగా ఇప్పటి వరకు ఎలాంటి భవనం నిర్మించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని పలువురు చెబుతున్నారు. అన్నదాన భవనంలో సెంట్రల్ స్టోర్స్ ఏర్పాటు చేసిన ప్రదేశంలో మరో 60 మంది, పైఅంతస్తు అందుబాటులోకి తీసుకొస్తే అందులో 350 మంది కలిపి ఒకేసారి 700 మంది వరకు భోజనం చేసే వీలుంటుంది. కానీ అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కేవలం నూతన భవనాల పరిశీలనలు, ప్రణాళికలకే పరిమితమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అన్నదాన భవనం నుంచి సెంట్రల్ స్టోర్, ప్రసాదశాలల్ని తరలించేలా సత్వర చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

నిరీక్షించలేక.. వెనుదిరిగి

రోజూ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజూ అటూఇటుగా సుమారు 3,500 మంది, శనివారాల్లో 5 వేల నుంచి 7,500 మంది, ఆదివారాల్లో 3 వేల నుంచి 5 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తుంటారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు భక్తులను కుర్చోబెట్టి వడ్డన చేస్తారు. శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ నేపథ్యంలో బఫే విధానంలో భోజనం వడ్డిస్తుంటారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిట్టింగ్‌లో ఒక్కో విడత 280 నుంచి 290 మంది మాత్రమే కూర్చుని భోజనం చేసే వీలుంది. దీంతో అన్నదానానికి వచ్చే భక్తులు గంటల తరబడి క్యూల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి. స్వామివారి అన్నప్రసాదం స్వీకరిద్దామని భవనం వద్దకు వచ్చే పలువురు భక్తులు, అక్కడ ఉన్న క్యూలను చూసి వెనుదిరుగుతున్న పరిస్థితులు కూడా ఉన్నాయి.

చిన్నపిల్లలతో గంటన్నర క్యూలో..



అన్నప్రసాదం స్వీకరించేందుకు పిల్లలతో క్యూలో గంటన్నరకు పైగానే నిల్చున్నాం. అంత సమయం పిల్లలతో క్యూలో ఉండటం ఇబ్బందిగా అనిపించింది. భక్తుల బాధలను దేవస్థానం అధికారులు అర్థం చేసుకుని, వెయిటింగ్ లేకుండా చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాస్, విజయనగరం

నీరసించాల్సిన పరిస్థితి



స్వామివారి దర్శనం సమయం కన్నా అన్నప్రసాదం స్వీకరించడానికే ఎక్కువ సమయం పడిగాపులు కాయాల్సి వచ్చింది. క్యూలోనే చాలా మంది నీరసించిపోతున్నారు. భక్తులు అన్నప్రసాద స్వీకరణకు ఇబ్బందుల్లేకుండా అవసరమైన ఏర్పాటన్లు అధికారులు చేయాలి.

– ఈశ్వరరావు, వడ్డాది

అంతర్జాతీయ చట్టాల అధ్యయనంతో మెరుగైన ఉపాధి

- డీఎస్ఎన్ఎల్‌యూ వర్క్‌షాప్‌లో న్యాయ నిపుణులు



సావనీర్ ఆవిష్కరిస్తున్న గోవా అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఆర్.వెంకటరావు, తదితరులు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న న్యాయ విద్యార్థులు

సబ్బవరం: ప్రపంచీకరణతో ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిందని, దీంతో అంతర్జాతీయ చట్టాలు, న్యాయశాస్త్రం అవసరం మరింతగా పెరిగిందని గోవా అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్.వెంకటరావు అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లో అంతర్జాతీయ చట్టంలో నూతన ధోరణులు, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై బుధవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంతర్జాతీయ, దేశీయ చట్టాల అధ్యయనం ఎలా అవకాశాలను సృష్టిస్తుందో వివరించారు. జాతీయ న్యాయ పరిశోధనల్లో ఒకప్పుడు విశాఖపట్నం దేశంలోనే ప్రముఖంగా ఉండేదని, ఆ వారసత్వాన్ని డీఎస్ఎన్ఎల్‌యూ కొనసాగించాలని ఆకాంక్షించారు. దేశాల మధ్య వివాదాలే కాకుండా, దేశ విదేశాల్లో వివిధ రకాల లావాదేవీలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించే కేటగిరీలో చాలా ఉద్యోగావకాశాలు న్నాయన్నారు.

అంతర్జాతీయ న్యాయ చట్టం అభ్యాసంతో ఉద్యోగ అవకాశాలు, విద్యావిధాన రూపకల్పన అభివృద్ధిపై న్యాయ నిష్ణాతులు.. పరిశోధకులు, న్యాయ విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. అనంతరం ప్రపంచ న్యాయ సంస్థల్లో ఉపాధి మార్గాలు, అంతర్జాతీయ దౌత్యం, మధ్యవర్తిత్వంలో విద్యార్థులు, నిపుణులకు సహాయపడేందుకు రూపొందించిన గైడ్ ఆన్ కెరీర్స్ ఇన్ ఇంటర్నేషనల్ లా(సీఐఎల్ఏడీ) సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విదేశాంగ మంత్రిత్వశాఖలో చట్టపరమైన ఒప్పందాల విభాగం డైరెక్టర్ డాక్టర్ యడ్ల ఉమాశంకర్, వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు, రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మదాసు, సెంటర్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ బి.సీలిమ, డాక్టర్ ఎస్.కిరణ్‌కుమారి, షెర్లీ హెప్సిబా తదితరుల పాల్గొన్నారు.

విస్తం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 59 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: పినగాడి విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 59 మంది ఎంపికయ్యారు. డైకిన్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో డిప్లొమా విద్యార్థులు వివిధ పోస్టులకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ఎండీ మళ్ల అనూష ప్రత్యేకంగా అభినందించారు. ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎంవీజేటీ అరుణ్, ఇంజనీరింగ్, డిప్లొమా విభాగాధిపతులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

పెందుర్తి: సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెందుర్తి కూడలి వద్ద గురువారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభం కానున్న శిబిరంలో దాతలు స్వచ్ఛందంగా వచ్చి, రక్తదానం చేయాల్సిందిగా కోరారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల అవరాలకు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అవయవదానం రిజిస్ట్రేషన్లు కూడా చేయనున్నట్లు తెలిపారు.

ఓవర్ లోడ్ బూడిద లారీలతో ఇబ్బందులు



లంకెలపాలెం వంతెన వద్ద ఓవర్‌లోడ్‌తో మలుపు తిరుగుతున్న బూడిద లారీలు



ఓవర్ లోడ్‌తో బూడిద వెదజల్లుతూ వెళ్తున్న లారీ

- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు

పరవాడ: ఓవర్ లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ముప్పుతిప్పలు పడుతున్నారు. సింహాద్రి ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి పరిమితికి మించి లారీలు బూడిదను లోడ్ చేసుకుని గ్రామీణ ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తున్నాయి. వీటి నుంచి ఎగసిపడుతున్న దుమ్ము ధూళితో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా లంకెలపాలెం–సబ్బవరం, లంకెలపాలెం–అనకాపల్లి, పరవాడ–లంకెలపాలెం రోడ్లపై అధిక లోడ్‌తో లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఫలితంగా పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, ప్రయాణికులు వీటి వెనుక రాకపోకలు సాగించేటపుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ దుమ్ముధూళిని పీల్చడంతో గొంతు, ముక్కు సంబంధ వ్యాధులు ప్రబలి అనారోగ్యానికి గురవుతున్నారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకున్న పాన్‌షాపులు, కిరాణా, టీ, టిఫిన్ దుకాణాలు, భోజన హోటళ్లపై బూడిద లారీల ప్రభావం అధికంగా ఉంది.

దీని వల్ల వ్యాపారంలో నష్టపోతున్నట్లు వర్తకులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్లతో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, ఇతర అధికార యంత్రాంగం నిర్లిప్తతపై సమీప గ్రామాల ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ప్రజల ఇబ్బందుల్ని గుర్తించి ఇప్పటికైనా ఓవర్ లోడ్‌తో ప్రయాణించే భారీ వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి





పాల్గొన్న మండల స్థాయి అధికారులు, సభ్యులు, సమావేశంలో ప్రగతి నివేదికలను వివరిస్తున్న ఏవో పోతల సత్యనారాయణ, చిత్రంలో ఎంపీపీ పద్మజ

- సబ్బవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పద్మజ

సబ్బవరం: సభ దృష్టికి సభ్యులు తీసుకువచ్చే సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల ప్రగతి నివేదికలను అధికారులు వివరించారు. కొందరు సభ్యులు పలు శాఖలకు సంబంధించిన సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత వ్యవసాయ, గృహ నిర్మాణ, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, మాతా శిశు సంక్షేమ శాఖ వంటి వాటిలో చేపట్టిన పనులను సమీక్షించారు. వేసవి కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యపై చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. అధికారులు సమాధానమిస్తూ.. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా 26 వర్క్‌లు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు.

గత ప్రభుత్వంలో 88 వర్క్‌లు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మిగిలిన వర్క్‌లు నిలిచిపోయాయని, వాటిని ఈ ప్రభుత్వం రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

సభలో చర్చించిన అంశాల్లో కొన్ని

- సుమారు రూ.150 కోట్లతో మండలంలోని భూదేవి చెరువు నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.
- డిగ్రీ కళాశాలను అనుకుని ఉన్న డంపింగ్ యార్డ్‌ను అనకపల్లి రోడ్డును సమీపంలోకి తరలించేందుకు పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.
- ప్రభుత్వం అర్బన్ హౌసింగ్ లబ్ధిదారులకు 2 సెంట్లు, రూరల్ హౌసింగ్ లబ్ధిదారులకు 3 సెంట్లు ఇచ్చేందుకు చూస్తోందని, మార్గదర్శకాలకు అనుగుణంగా విధివిధానాలు ఖరారు చేసి, త్వరలో లబ్ధిదారులకు స్థలాలు, గృహాలు మంజూరు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.
- గ్రామాల్లో ప్రాధాన్యతా పనులు పూర్తి చేసే అవకాశం ఉండటంతో పెండింగ్‌లో ఉన్న సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలను తొలి దశలో పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ ఏఈ తెలిపారు.
- లగిశెట్టిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏడేళ్లుగా అంగన్‌వాడీ కార్యకర్త లేరని, దీంతో ఆ కేంద్రం నిర్వహణ ప్రశ్నార్థకంగా మారిందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తను సస్పెండ్ చేయడంతో ఆమె కోర్టునాశ్రయించారని, దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఐసీడీఎస్ అధికారులను సూచించారు.
- ప్రభుత్వం అధికారం చేపట్టిన నుంచి రేషన్ కార్డుల విభజన సమస్య ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సభ్యులు తహసీల్దార్‌కు సూచించారు.
- దీపం పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్లకు చాలా మంది దూరమవుతున్నారని, పథకం అందనివారు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియట్లేదన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భారీ ఆక్రమణ తొలగింపు

వెల్లువలా ఫిర్యాదులు రావడంతో స్పందించిన అధికారులు



రెవెన్యూ అధికారులు తొలగించిన అక్రమ నిర్మాణం

పెదగంట్యాడ: భూ ఆక్రమణపై మరోసారి రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని దయాల్‌నగర్ ప్రాంతం వికాస్‌నగర్ జంక్షన్‌కు ఎదురుగా బీసీ రోడ్డుకు ఆనుకొని సర్వే నెంబర్ 43/1లో ప్రభుత్వ స్థలం ఉంది. ఆ స్థలం పక్కనే ఉన్న జిరాయితీ స్థలాన్ని ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. ఇదే అదునుగా భావించి అతని స్థలానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలం 156 చదరపు గజాలు ఆక్రమించేశాడు. అక్కడితో ఆగకుండా పెద్ద ఎత్తున నిర్మాణం చేపట్టాడు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న మండల రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు. సర్వే చేసి అందులో ప్రభుత్వ భూమి ఉండడంతో అందులో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని గత నెల 23న తొలగించారు. అయితే ఆక్రమణదారుడు మాత్రం అధికారుల ఆదేశాలను పక్కన పెట్టేశాడు. ఓ కార్పొరేటర్ అండతో మళ్లీ నిర్మాణం ప్రారంభించారు. చకచకా పనులు చేపట్టాడు. ఈ నేపథ్యంలో మరోసారి ఫిర్యాదులు అందుకున్న రెవెన్యూ అధికారులు ఆక్రమణదారునికి నోటీసులు ఇచ్చారు. ఆపై ఆక్రమణను బుధవారం తొలగించారు.

65వ వార్డు కార్పొరేటర్ అత్యుత్సాహం

కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్కడ నిర్మాణం చేపట్టడంతో అధికారులు బుధవారం తొలగించేందుకు ప్రయత్నం చేస్తుంటే 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు (కేబుల్ మూర్తి) అత్యుత్సాహం ప్రదర్శించారు. రెవెన్యూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అధికారులపై చిందులు తొక్కారు. అయితే రెవెన్యూ అధికారులు ఒత్తిడికి తలొగ్గకుండా ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాన్ని తొలగించారు. మరోసారి నిర్మాణం చేపడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్లాన్ రెసిడెన్షియల్.. నిర్మాణం కమర్షియల్

దయాల్‌నగర్ ఏరియా బీసీ రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలంలో రెసిడెన్షియల్ ప్లాన్ తీసుకుని కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. మామూళ్ల మత్తులో పడి ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే రెవెన్యూ అధికారులు సదరు స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని తొలగించేందుకు సిద్ధం కావడంతో అప్రమత్తమైన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అప్పటికప్పుడు నోటీసు సిద్ధం చేశారు. ఆ నోటీసు సదరు నిర్మాణానికి అతికించి చేతులు దులుపుకున్నారు.